సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 1 । జనవరి । 2025



320 మంది హాజరు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రెండోరోజు చేపట్టిన దేహదారుఢ్య పరీక్షలకు 600 మందికి 320 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాలూరు: జిల్లా ప్రజలకు మాజీ డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇంటికి మంగళవారం రాత్రి పలువురు నాయకులు, అభిమానులు వెళ్లి ముందస్తుగా కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

అక్రిడిటేషన్లకు గడువు పెంపు

పార్వతీపురం: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంలో రెండు నెలల పాటు గడువును పొడిగించినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి ఎల్. రమేష్ తెలిపారు. జనవరి 1 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు గడువును పొడిగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు గతంలో అక్రిడిటేషన్ కార్డులు పొందిన పాత్రికేయులకు మాత్రమే ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఆయా సంస్థల నుంచి పాత్రికేయుల జాబితా వచ్చిన వారికే అక్రిడేషన్లను పొడిగింపు చేయనున్నట్లు తెలిపారు.

బొకేలు తీసుకురావద్దు

పార్వతీపురం: నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు బొకేలు, స్వీట్లు తీసుకురావద్దని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొకేలు, స్వీట్లు కోసం వెచ్చించిన సొమ్ముతో జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న వారికి తోడ్పాటు అందించాలన్నారు. 'ఎనీమియా ముక్త్ పార్వతీపురం'లో భాగంగా ఆరోగ్య అమృత ఆహారం న్యూట్రిషన్ కిట్లు పంపిణీకి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. విరాళాలు అందించేవారు 'బాలిక శిశు అభివృద్ధి నిధి (ఖాతా నంబర్ 06990100032, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఐసీఐసీఐ 0000701)కి తమకు తోచినంత జమచేయవచ్చన్నారు. రక్తహీనత ఉన్నవారిని దత్తత తీసుకుంటే మరింత ఆనందించడం జరుగుతుందన్నారు.

డిప్యుటేషన్ల రద్దు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి రాష్ట్రంలోని వివిధ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలకు డిప్యుటేషన్‌పై కొద్ది రోజుల కిందట నియమించిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ట్రైబల్ వెల్ఫేర్ స్టేట్ డైరెక్టర్ సదా భార్గవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల ఎస్‌జీటీ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై గత నెలలో నియమించారు. వీరందరిని వెంటనే రిలీవ్ చేయాలని గురుకులాల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

సమ్మె తాత్కాలిక విరమణ

పార్వతీపురం టౌన్: గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్టు తెలిపారు. సమ్మెకు మద్దతు తెలిపిన అన్ని సంఘాల వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బతుకు దెరువు కోసం వెళ్లి..

ఆత్మకూరు: బతుకు దెరువు కోసం వచ్చిన పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై షేక్ జిలానీ కథనం మేరకు.. వీరఘట్టం మండలం తుడి గ్రామానికి చెందిన మద్దయ్య (52) కొందరు వ్యక్తులతో కలిసి దుప్పట్లు, రగ్గులు విక్రయిస్తుంటాడు. ఇటీవల తమ జిల్లాకు చెందిన కొందరితో కలిసి బుచ్చిరెడ్డిపాలెంలో అద్దె ఇంట్లో ఉంటూ మోటార్‌బైక్‌పై గ్రామాల్లో దుప్పట్లు, రగ్గులు విక్రయిస్తున్నాడు. మంగళవారం బైక్‌పై మర్రిపాడు మండలానికి వెళ్తుండగా కరటంపాడు సమీపంలో హైవేపై ముందు వెళ్తున్న ఎద్దుల బండిలో ఉన్న నాగేటి కొయ్యను ఢీకొని రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మద్దయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పరిహారం చెల్లింపులో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగిన దాడుల కేసుల్లో బాధితులకు త్వరగా నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో వాస్తవాలను తెలుసుకొని కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు.

– జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఇంతవరకు 49 మందిని అదుపులోకి తీసుకొని 9 వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు.

– హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదుచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సురానా అంకిత మహావీర్, డీఆర్‌ఓ కె.హేమలత, జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన, కమిటీ సభ్యులు డి. శాంతి రాజు, తదితరులు పాల్గొన్నారు.



కోటి ఆశలతో స్వాగతం

- నూతన సంవత్సర శుభాకాంక్షలు

కష్టసుఖాలు మిగిల్చిన 2024వ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరం 2025లో 12 నెలలు సంతోషంగా.. 52 వారాలు ఆరోగ్యంగా.. 365 రోజులు విజయవంతంగా గడవాలి. ప్రజలందరి జీవితాలు ఆనందంగా.. ఆరోగ్యంగా ఉండాలి. కలలు, ఆశలన్నీ నెరవేరాలి. భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలి. అందరి జీవితాల్లో కోటి వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని హుకుంపేటలో గల మయూరి నృత్యాలయం చిన్నారులు నూతన సంవత్సరం రాకను ఆహ్వానిస్తూ మంగళవారం అర్ధరాత్రి కొవ్వొత్తుల వెలుగుల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నాడు సంక్షేమం.. నేడు దుర్భిక్షం!

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు
- ఎన్నికల సంవత్సరం ముగిసినా పథకాలు ఊసెత్తని వైనం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తొలిమూడు నెలల పాలనలో సంక్షేమ పథం
- నేడు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి పేదల పథకాలకు చెల్లు!



వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న అప్పటి కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురంటౌన్:



పార్వతీపురం మన్యం జిల్లా.. అభివృద్ధి కేంద్రీకరణే లక్ష్యంగా అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన జిల్లాల విభజన ప్రక్రియ ఫలితంగా 2020 ఏప్రిల్ 4వ తేదీన ఏర్పడింది. అప్పటి నుంచి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేసేవారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ అన్ని రంగాల్లో జిల్లాను ముందుకు తీసుకువెళ్లేవారు.అభివృద్ధి సంక్షేమంలో ముందుకు వెళ్తున్న పార్వతీపురం మన్యం జిల్లాలో 2024 సంవత్సరం మార్చి నెల నుంచి సంక్షేమం, అభివృద్ధికి బ్రేకులు పడ్డాయి. ఆందోళనలు, నిరసనలు హోరెత్తుతున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ పాలనలో...

2024 జనవరి నెలలో...

- **1వ తేదీ..** వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద అప్పటివరకు 1,43,800మందికి పింఛన్లు అందజేస్తే.. జనవరి 1న కొత్తగా 1698 మందికి పింఛన్లు మంజూరుచేసి ఆ సంఖ్యను 1,45,498కు చేర్చింది.
- **5న...** వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని వారికి నవరత్న వికాసం పథకం కింద జిల్లాలో 777 మందికి రూ.1.16కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు.
- **6న..** జిల్లాలో 37 పీహెచ్‌సీలకు ఇద్దరు చొప్పున వైద్యులను నియమిస్తూ గిరిజన గ్రామాల్లో వైద్యసేవలు విస్తృతం చేశారు.
- **11న..** చిన్న, చిరు వ్యాపారాలు చేసిన వారికి ఆర్థిక భరోసాను ఇస్తూ ఆసరా పథకం ద్వారా జిల్లాలో 7,460 మంది చిరు వ్యాపారులకు 7.59 కోట్ల నగదును నేరుగా వ్యాపారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.
- **18న..** ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న ఉద్దేశంతో జిల్లాలో 7,660 మంది లబ్ధిదారులకు రూ. 81.03 కోట్లను లబ్ధిదారులు ఖాతాల్లో జమచేశారు.
- **20న..** మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో 1622 హెక్టార్లలో సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలకు భరోసాను కల్పిస్తూ వీడీవీకెల ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించి గిరి రైతులకు భరోసా కల్పించారు.
- **23న...** డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పథకం కింద 1,83,077 మందికి రూ.94.33కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమచేశారు.
- **25న..** గిరిజన గ్రామాల్లో సచివాలయ సేవలకు, పేదలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందించేందుకు గిరిశిఖర గ్రామాల్లో 196 మొబైల్ టవర్లను రూ. 200 కోట్లతో నిర్మించి డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చారు.
- **30న..** గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కె.పాడులో హెచ్‌టీఎన్‌సీలో రూ. 1.5కోట్లతో అడ్వెంచర్ పార్క్‌ను ప్రారంభించారు.

ఫిబ్రవరి నెలలో...

- **10వ తేదీన..** గ్రామాల్లో అభివృద్ధికి నాంది పలుకుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జిల్లాకు 15.80 కోట్లు మంజూరు చేశారు.
- **11న..** గిరి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సికెల్‌సెల్ ఎనిమియాపై విద్యార్థులకు తనిఖీలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలందించారు.
- **20న..** వైఎస్సార్ కళ్యాణ మస్తు, సాదీతోఫా కింద జిల్లాలో 172 వధూవరులకు రూ. 1.12 కోట్లు అందజేశారు.
- **28న..** జిల్లాలోని 1,46,016 మంది రైతన్నలకు రైతు భరోసా పథకంకింద రూ.29.32కోట్లు రైతన్నల ఖాతాల్లో జమచేశారు.

మార్చి నెలలో..

- **1వ తేదీ..** జగనన్న విద్యాదీవెన పథకం కింద 18,369 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.12.32కోట్లు నేరుగా జమచేశారు.
- **2న..** పాచిపెంట మండలం రాయిగుడ్డివలస నుంచి బీరన్నదొరవలస వరకు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును అప్పటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రారంభించారు.
- **6న..** రైతులకు ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద జిల్లాలో 256 మంది రైతులకు రూ. 14.75 లక్షల నష్టపరిహారాన్ని అందజేశారు.
- **8న..** వైఎస్సార్ చేయూత పథకం 4వ విడతలో భాగంగా 40–65 ఏళ్ల వయస్సు మధ్య గల 72,845 మంది మహిళలకు రూ. 136.60కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు.
- **11న..** కళ్యాణ మస్తు పథకం 4వ విడత ద్వారా 172మంది లబ్ధిదారులకు రూ.1.12కోట్లు నేరుగా వధూవరుల ఖాతాల్లో జమచేశారు.
- **14వ తేదీ..** 60 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా 3వ విడత కింద 1193మంది మహిళలకు రూ. 178.95లక్షలు వారి ఖాతాల్లో జమచేశారు.



నవరత్న వికాసంలో భాగంగా కొత్త పింఛన్ అందజేస్తున్న అప్పటి ఎమ్మెల్యే జోగారావు



ఇటీవల కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక...



ఇటీవల కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను పక్కన పెట్టి యూటర్న్ పాలిటిక్స్ విధానాన్ని అవలంభిస్తోంది. దీంతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

సెప్టెంబర్ నెలలో..

- మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న హామీ అమల్లోకి రాలేదు.
- **23వ తేదీ..** చిరు ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం రాజకీయ ఒత్తిళ్లతో వీఓఏలపై తొగించారు. నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

అక్టోబర్ నెలలో..

- **3వ తేదీన..** నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ గ్రామాల్లో మద్యం షాపులు మాకొద్దంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు జిల్లా కేంద్రంలోని మహత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన
- **22న..** విద్యా సంబంధిత పథకాలపై ప్రభుత్వం నోరు మెదపడం లేదని, తక్షణమే ప్రభుత్వ పథకాలు అందజేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలని ఆందోళన
- **28న..** బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలను రద్దుచేయాలని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలో ర్యాలీ..

నవంబర్ నెలలో...

- **10వ తేదీ..** 104 ఉద్యోగులు తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌వద్ద నిరసన దీక్ష.
- **16న...** మినీ అంగన్‌డీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా మార్చాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా
- **18న..** ఆశవర్కర్లు తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని, తమకు వేతనాలు పెంచాలని కలెక్టరేట్ వద్ద ధర్నా
- **29వ తేదీ..** ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తూ బోధనేతర పనులు చేయాలని ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించింది. గజపతినగరంలో శిక్షణలో ఉపాధ్యాయుడు మృతి చెందడంతో పార్వతీపురం డీఈఓ కార్యాలయం వద్ద నిరసన

డిసెంబర్ నెలలో..

- **13వ తేదీ..** రైతు భరోసా పథకాన్ని పేరుమార్చి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 20వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీలిచ్చింది. ఆరు నెలలు గడుస్తున్నా సాయం అందించక పోవడంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాతలకు అండగా కార్యక్రమాన్ని నిర్వహించి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు.
- **27వ తేదీ..** కూటమిప్రభుత్వం వినియోగదారులకు వెన్నుపోటు పొడుస్తూ ఆరునెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లాలో గల విద్యుత్ కార్యాలయాల వద్ద పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టారు.



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

రక్తహీనత రహిత జిల్లాయే లక్ష్యం

- కొత్త సంవత్సరంలో నూతన ప్రణాళికలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సాక్షి, పార్వతీపురం మన్యం: నూతన సంవత్సరంలో జిల్లాను రక్తహీనత నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను, 2025లో నూతన ప్రణాళికలను వివరించారు. రక్తహీనత నియంత్రణకు గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి .. గర్భిణులను దత్తత తీసుకునేందుకు దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేటల్లో గర్భిణుల కోసం ప్రత్యేక వసతిగృహాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

మరో మూడు చోట్ల కంటైనర్ వైద్య సేవలు

రాష్ట్రంలోనే తొలిసారిగా సాలూరు మండలం తోణాం పీహెచ్‌సీ పరిధి కారడవ లసలో కంటైనర్ ఆధారిత ఆసుపత్రి (గిరి వైద్య ఆరోగ్య కేంద్రం) సేవలను ప్రారంభించామని చెప్పారు. కురుపాం నియోజకవర్గంలో రెండు, పాలకొండ నియోజకవర్గంలోని భామిని మండలంలో ఒకటి రాబోయే వారంలో ప్రారంభిస్తామని స్పష్టంచేశారు.

మలేరియా నివారణకు చర్యలు

జిల్లాలో మలేరియా నివారణకు డ్రోన్‌ల ద్వారా ఐఆర్‌ఎస్ పిచికారీ చేయడంతో పాటు గతేడాది లక్ష గంబూషియా చేపల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. వసతిగృహాల్లో కొన్ని అనారోగ్య కారణాల కేసులు నమోదయ్యాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుల కోసం సుమారు రూ.189 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

డోలీల మోత తప్పేలా...

గిరి శిఖర ప్రాంతాల్లో డోలీల మోత తప్పేలా రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. 31.72 కిలోమీటర్ల మేర రూ. 29.61 కోట్ల వ్యయంతో 19 రోడ్లు వేస్తున్నామని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.211 కోట్లతో దాదాపు 472 పనులు మంజూరయ్యాయని, వీటిలో ఇప్పటికే రూ.102 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇందులో 190 తారు రోడ్లు, రక్షణ గోడలు ఉన్నాయని చెప్పారు. అన్ని గ్రామాలకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ల కోసం రూ. 570 కోట్లు అవసరమని అంచనా వేశామని తెలిపారు. రూ.23 కోట్లతో గుంతల లేని రహదారుల పనులు జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి ముగుస్తుందని చెప్పారు.

– పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తూ.. చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

– జీవనోపాధి కార్యక్రమాల కింద జీడిపప్పు, పసుపు, చింతపండు, కుట్టు తదితర రంగాల్లో 78 వన్ ధన్ వికాస్ కేంద్రాలను (వీడీవీకే) బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. దాదాపు 713 రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని, 4,660 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

– జిల్లాలోని 1,987 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.1432 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మాణం కోసం ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టుకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. జంగిల్ క్లియరెన్స్ కింద 95 పనులను రూ.30 కోట్లతో చేపట్టామన్నారు. 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి కానున్నాయని తెలిపారు.

ఐసీడీఎస్‌లో అవినీతి అనకొండలు!

- కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల్లోనూ 'చేతివాటం'
- తీవ్రంగా పరిగణించిన కలెక్టర్
- జిల్లా అధికారిణిపై చర్యలు
- కొత్త మహిళా శిశు సంక్షేమ అధికారిణిగా కనకదుర్గ నియామకం



సాక్షి, పార్వతీపురం మన్యం: ఐసీడీఎస్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్. అంగన్‌వాడీలకు సరఫరా చేసే పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించడమే కాక.. మహిళాశిశు సాధికారిత కోసం పలు కార్యక్రమాలు చేపట్టకుండానే 'చేపట్టినట్లు' బిల్లులు చేసుకోవడం వరకూ అక్కడి అధికారులది అందెవేసిన చేయి. ఇంకా.. ఆ శాఖలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు జరిగాయంటే.. 'ఉన్నత' స్థానంలో ఉన్న అధికారులకు పండగే. ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో దండుకుంటారన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో ఇటీవల జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్)లో పలు విభాగాల పోస్టులను భర్తీ చేశారు. దీనికితోడు మహిళల రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్(సఖి)ను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ పోస్టుల భర్తీలో నిబంధనలకు నీళ్లు వదిలి.. 'బంధుప్రీతి', 'నగదు బదిలీ'తో నియామకాలు జరుపుకొన్నారు. బాలల కోసం పని చేసే విభాగంలో ఇప్పటికే భర్తలు ఉన్నచోట్ల.. మూడు పోస్టుల వరకు వారి భార్యలను నియమించుకోవడం చూస్తుంటే.. ఎంతగా 'బంధుప్రీతి' పని చేసిందో అర్థం చేసుకోవచ్చు. వన్‌స్టాప్ సెంటర్ నియామకాల్లోనూ పోస్టును బట్టి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణ లు ఉన్నాయి. ఏడాదిగా బాలసదన్‌లో పిల్లలు లేకుండానే.. ఉన్నట్లు చూపించి, ఉద్యోగులకు జీతాలతో పాటు.. మిగతా బిల్లులను పెట్టుకుని పెద్దఎత్తున నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల్యవివాహాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతా ల్లో పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేయాలని ప్రభు త్వం ఆదేశిస్తే.. అసలు ఏర్పాటు చేయకుండానే రూ.లక్షల్లో నిధులు డ్రా చేసుకున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి. దీనిపై అధికారిక సమావేశంలోనే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు జిల్లా ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు.

జిల్లా అధికారిణిపై ఆరోపణలు

మహిళాశిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిణిగా ఇప్పటి వరకు వ్యవహరించిన ఎం.ఎన్.రాణిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ.. ఉద్యోగానికీ ఒక రేటు పెట్టేశారన్న విమర్శలు ఉన్నాయి. సొంత శాఖలోనే పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఇలాంటి అవినీతి దందాకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారని భోగట్టా. సదరు ఉద్యోగిని చూస్తే, రెగ్యులర్ ఉద్యోగులు సైతం హడలిపోయే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఈ అవినీతి దందాపై గతంలోనే పలుమార్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఆయన హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆమెపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారుల కు సిఫారసు చేశా రు. ఈ క్రమంలోనే ఇన్‌చార్జి పథక అధికారిణిగా వ్యవహరిస్తున్న ఎంఎన్ రాణిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఆ స్థానంలో రాజాం సీడీపీఓగా పని చేస్తున్న తోట కనక దుర్గను జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యా యి. జిల్లా ఐసీడీఎస్‌లో జరుగుతున్న అవినీతి భాగోతంపై రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. తన పోస్టును కాపాడుకునేందుకు ఇప్పటివరకు ఉన్న పథక అధికారిణి ప్రయత్నించగా.. 'ఇప్పటికే ఆలస్యం అయిందని' మంత్రి వ్యాఖ్యానించినట్లు సమాచారం.